## స్పందించారు.. చెత్తను తొలగించారు



మున్సిపల్ కార్యాలయం గోడపక్కన వేసిన చెత్తను తొలగించి, శుభ్రం చేయించిన మున్సిపల్ అధికారులు

కామారెడ్డి, జనవరి 10 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కన పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'చెత్త'శుద్ధి ఏది? అనే శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి మున్సిపల్ కార్యాలయం గోడ పక్కన వేసిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్పందన మాట్లాడుతూ.. సంబంధిత వ్యక్తులకు మెమోలు జారీ చేశామని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు చెత్తను చెత్త ఆటోల్లోనే వేయాలని, రోడ్లపైన వేయొద్దని సూచించారు. రోడ్లపై చెత్తను వేసినవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి, జనవరి 10 : జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఆయన చాంబర్‌లో శుక్రవారం అధికారులతో మాట్లాడారు. ఈ నెల 18వ తేదీన నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు జిల్లాలో 14 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సెంటర్‌కు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి సెంటర్‌లోను విద్యార్థులకు సౌకర్యాలు తాగునీరు ఏర్పాటు చేయాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

## బాధితుడికి ఎల్వోసీ అందజేత



ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ గాంధారి మండల నాయకులు

గాంధారి, జనవరి 10: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి మెరుగైన చికిత్స నిమిత్తం ఎమ్మెల్సీ కవిత సహకారంతో మంజూరైన ఎల్వోసీని స్థానిక నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. మండలంలోని పొతంగల్ కలాన్‌కు చెందిన సీతాయిపల్లి సాయిలు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని స్థానిక నాయకులు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ కవితతో మాట్లాడారు. స్పందించిన ఆమె వెంటనే రూ.లక్షా50వేల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన కాపీని బాధిత కుటుంబీకులకు గాంధారి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రెడ్డి రాజు తదితరులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ కవితను ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకుడు నాగ్లూర్ సాయిలు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, వైద్య ఖర్చుల కోసం ఎల్వోసీని అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కామారెడ్డి, జనవరి 10 : జిల్లా కేంద్రంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాహనాలు, ఆటోలకు రహదారి భద్రత పోస్టర్లు అతికించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డితోపాటు అధికారులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మోటర్ వాహన తనిఖీ అధికారి శ్రీనివాస్, నాగలక్ష్మి, సహాయక వాహన తనిఖీ అధికారి భిక్షపతి, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్, హోం గార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఈపాస్ మిషన్ ద్వారా యూరియాను పంపిణీ చేయాలి

మాచారెడ్డి, జనవరి 10 : రైతులకు ఈపాస్ మిషన్ ద్వారా యూరియా పంపిణీ చేయాలని కామారెడ్డి ఏడీఏ అపర్ణ అన్నారు. శుక్రవారం గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ లోని ఫెర్టిలైజర్ షాపులను ఆమె తనిఖీ చేశారు. రైతులకు యూరియా పంపిణీ చేసేటప్పుడు ఆధార్‌కార్డుతో ఈపాస్ మిషన్ ద్వారా పంపిణీ చేయాలని సూ చించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు.

## స్థల వివాదంపై అధికారుల విచారణ



గ్రామస్తుల సమక్షంలో వివరాలు సేకరిస్తున్న గిర్దావర్, ఎంపీవో

బాన్సువాడ రూరల్, జనవరి 10 : బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులో ఇంటి స్థలం వివాదంపై సబ్‌కలెక్టర్ కిరణ్మయి ఆదేశాల మేరకు గిర్దావర్ అశోక్ ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి శుక్రవారం విచారణ చేపట్టారు. బొంబాయి గంగాధర్ అనే వ్యక్తి తన బంధువుకు చెందిన ఇంటి స్థలాన్ని ఇతరులు కబ్జా చేశారని, వారసుడిగా ఇంటి స్థలం తనకు కేటాయించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కిరణ్మయికి బాధిత వ్యక్తి ఫిర్యాదు చేశాడు. స్థల వివాదంపై విచారణ చేపట్టి నివేదిక అందించాలని అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్తుల నుంచి, గ్రామ పంచాయతీ అధికారుల ద్వారా వివరాలు సేకరించామని, నివేదికను సబ్ కలెక్టర్‌కు అందించనున్నట్లు గిర్దావర్, ఎంపీవో తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, కారోబార్ వినయ్‌కుమార్, గ్రామపెద్దలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, చందర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి నాగరాణి

భిక్కనూరు, జనవరి 10 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భిక్కనూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ న్యాయమూర్తి నాగరాణి చైల్డ్ లేబర్, చైల్డ్ ప్రొటెక్షన్ పోక్సో విద్యా హక్కు చట్టలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు మత్తు పదార్థాలు, సోషల్ మీడియాకు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లక్ష్యాలను నిర్ధేశించుకొని వాటిని సాధించేందుకు కృషి చేయాలని చెప్పారు. న్యాయ సలహాలు పొందడానికి టోల్ ఫ్రీ నంబర్ 15100కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు





రాజంపేట్ మండలం అన్నారం తండా ప్రాథమిక పాఠశాలలో, లింగంపేటలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

లింగంపేట/ రామారెడ్డి/ పెద్దకొడప్‌గల్/బాన్సువాడ రూరల్/మాచారెడ్డి/రాజంపేట్, జనవరి10: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. బాలికలు రంగవల్లులు వేయగా.. బాలురు గాలి పటాలను ఎగురవేశారు. ప్రభుత్వం పాఠశాలలకు శనివారం నుంచి సెలవులు ప్రకటించడంతో ఒక రోజు ముందుగానే పండుగ సంబురాలు చేసుకున్నారు. సదాశివనగర్ మండలం మర్కల్ మల్లన్న గుట్ట వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు ఎన్ఎస్ఎస్, కల్చరల్ కమిటీ కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ శోభారాణి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మీనా, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ చంద్రకళ, వనమాల, వాణి తదితరులు పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు ఉపాధ్యాయురాలు ప్రత్యూష తెలిపారు. సంక్రాంతి విశిష్టతను చిన్నారులకు వివరించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చిన్నరాంపూర్ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. బోర్లం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గులపోటీలు నిర్వహించగా, రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో కైట్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నక్క ప్రవీణ్, రమణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అక్కాపూర్ గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు కామారెడ్డి ఏఎంసీ డైరెక్టర్ రాజలింగం అరటి పండ్లు, బహుమతులను ప్రదానం చేశారు. రాజంపేట్ మండలం అన్నారం తండాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పతంగులు సైతం ఎగురవేసినట్లు మండల విద్యాధికారి పూర్ణచంద్రరావు తెలిపారు.

## అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

రాజంపేట్, జనవరి 10 : అప్పుల బాధ భరించలేక ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆర్గొండ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్గొండ గ్రామానికి చెందిన చౌదరి రాజశేఖర్(27) గతంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అక్కడి పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. చేసిన అప్పులు పెరిగిపోయాయని తరచూ బాధపడుతుండేవాడు. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ జాబ్ చేస్తున్న రాజశేఖర్ నాలుగు రోజుల క్రితం సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. గురువారం రాత్రి తమ పొలం వద్ద పడుకుంటానని చెప్పి వెళ్లాడు. శుక్రవారం ఉదయం బస్వన్నగుట్ట వద్ద ఉన్న మర్రి చెట్టుకు ఉరేసుకున్నాడు. అప్పుల బాధతో మనస్థాపం చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, తన కొడుకు మృతిపై ఎవరిపైనా ఎలాంటి అనుమానం లేదని, తండ్రి చౌదరి సిద్ధిరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## 'ఆశ'ల సమస్యలు పరిష్కరించాలి



ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

లింగంపేట(ఎల్లారెడ్డి రూరల్), జనవరి10: వైద్యశాఖలో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. రెండేండ్ల క్రితం సమ్మె చేపట్టగా అప్పటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు నిర్దిష్టమైన హామీ ఇచ్చినట్లు తెలిపారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఫిబ్రవరిలో నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సర్వే డబ్బులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదిగల సత్తా చాటుతాం

### ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు సామ్యూల్

లింగంపేట, జనవరి 10: ఎస్సీల వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారని, ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశంలో మాదిగల సత్తా చాటుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు మంథని సామ్యూల్ వెల్లడించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపై రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం నుంచి వర్గీకరణ తీర్పు సాధించుకుంటే, సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ కులాలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్గీకరణ అమలు చేయకుంటే చావు డప్పు మోగించి ప్రభుత్వానికి తడాఖ చూపుతామని హెచ్చరించారు. నాయకులు కంతి పద్మారావు, లక్ష్మి, ద్యామని భూపతి, కిషన్, చిన్న సంగయ్య, అల్లూరి, సాయిరాం, బాలరాజు, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు సామ్యూల్

## సీఎంఆర్ఎఫ్‌ల చెక్కుల పంపిణీ

బిచ్కుంద/ పెద్దకొడప్‌గల్, జనవరి 10: బిచ్కుంద మండలంలోని ఖత్‌గావ్‌లో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఏఎంసీ వైస్ చైర్మన్ కొంగల శంకర్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్ దేశాయ్, గుండేకల్లూర్ రాజు పటేల్, మాజీ సర్పంచ్ జీవన్, మాజీ ఎంపీటీసీ రాజు పటేల్, గ్రామ అధ్యక్షుడు రాజు, మన్నూ, కాశీనాథ్, సత్తర్ తదితరులు పాల్గొన్నారు. పిట్లం మండలంలో పలువురికి మంజూరైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను ఏఎంసీ చైర్మన్ మనోజ్‌కుమార్ పంపిణీ చేశారు. మొత్తం ఆరుగురికి చెక్కులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకుడు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బడీడు పిల్లల గుర్తింపు



ఇందిరానగర్‌లో గుర్తించిన బడీడు పిల్లలు

లింగంపేట/ నిజాంసాగర్, జనవరి10: లింగంపేట మండలంలోని పోతాయిపల్లి, లింగంపేట గ్రామాల్లో శుక్రవారం బడి బయటి విద్యార్థుల గుర్తింపు కోసం సర్వే నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి షౌకత్ అలీ తెలిపారు. ఆయా క్లస్టర్ల సీఆర్పీలు గ్రామాల్లో సర్వే నిర్వహించి ఇందిరా నగర్‌లో ముగ్గురు విద్యార్థులను గుర్తించినట్లు చెప్పారు. బడి బయటి విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకత వివరిస్తున్నట్లు తెలిపారు. గుర్తించిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని చెప్పారు. ఎంఈవో వెంట సీఆర్పీలు గంగాధర్, సంగాగౌడ్ తదితరులు ఉన్నారు. నిజాంసాగర్ మండలంలోని కొమలంచ గ్రామంలో గొర్రెలు కాస్తున్న బడిబయటి పిల్లలను సీఆర్పీలు వెంకట్‌రామాగౌడ్, శంకర్ గౌడ్ గుర్తించారు. వారిని పనిలో పెట్టుకున్న యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తుంకిపల్లిలో తండాలో గొలుసుల విజయ అనే బడిబయటి విద్యార్థిని గుర్తించారు.

## ప్రమాదవశాత్తు కిందపడి మహిళ మృతి

నాగిరెడ్డిపేట, జనవరి10: కాలికి రాయి తగిలి మహిళ కిందపడి మృతిచెందిన ఘటన మండలంలోని తాండూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండూర్ గ్రామానికి చెందిన చాకలి జమున(45) గురువారం రాత్రి బహిర్భూమి కోసం బయటికి వెళ్లింది. దారిలో కాలికి రాయి తగిలి ముందుకు పడింది. ఆమె రాకపోవడంతో కుమారుడు రాజు వెతుక్కుంటూ వెళ్లాడు. కొద్దిదూరంలో పడి ఉండడాన్ని గమనించి ఇంటికి తీసుకువచ్చారు. గమనించగా.. జమున అప్పటికే మృతిచెందింది. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.



విద్యార్థి ఆకాశ్, గైడ్ టీచర్ జైపాల్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

## ఇన్‌స్పైర్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక

నిజాంసాగర్, జనవరి 10: మండలంలోని అచ్చంపేట మోడల్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి ఆకాశ్ ఇన్‌స్పైర్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో ఈనెల 7,8,9 వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రదర్శనలో నూతన విధానంలో విత్తనాలు నాటే యంత్రాన్ని అతడు ప్రదర్శించాడు. గురువారం సాయంత్రం వెలువడిన ఫలితాల్లో ఆకాశ్ ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన క్యాక్రమంలో విద్యార్థితో పాటు గైడ్ టీచర్ జైపాల్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గాంధారి, జనవరి 10: మండలంలోని ముదెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బాన్సువాడకు చెందిన వారధి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి అధ్యక్షుడు గోపాల్ ఠాగూర్ బహుమతులను అందజేశారు. హెచ్ఎం శరత్‌చంద్ర చౌదరి, పి.మహేందర్, వై.మహేందర్, కవిత, మానస, స్వర్ణలత, గంగమణి పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు

నాగిరెడ్డిపేట, జనవరి 10: గోపాల్‌పేట సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మాసన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి బైకుపై స్వగ్రామానికి వెళ్తుండగా, మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామానికి చెందిన సొల్లు రాములు, తోమ సునీత బైకుపై గోపాల్‌పేటకు వస్తున్నారు. మార్గమధ్యంలో రెండు బైకులు ఢీకొన్నాయి. శ్రీనివాస్‌రెడ్డి తలకు గాయాలు కాగా.. రాములు, సునీత కాళ్లు విరిగాయని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు చెప్పారు. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

## గ్రామాలను సందర్శించిన మండల ప్రత్యేకాధికారులు



పోచారంలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారిణి రత్నం

నిజాంసాగర్/ నాగిరెడ్డిపేట, జనవరి 10: నిజాంసాగర్‌లో మండల ప్రత్యేకాధికారి శ్రీపతి పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, పలు రిజిష్టర్లను పరిశీలించారు. రోగుల వివరాలు, మందుల నిల్వ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. కస్తూర్బా హాస్టల్‌లో విద్యార్థినులు వేసిన ముగ్గులను చూశారు. అనంతరం గొర్గల్ జీపీని సందర్శించారు. ఎంపీడీవో గంగాధర్, ఉపాధి హామీ ఏపీవో శివకుమార్, టీఏ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామాన్ని మండల ప్రత్యేక అధికారిణి రత్నం శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ డ్రైనేజీలు పరిశీలించి సంతృప్తిని వ్యక్తంచేశారు. అనంతరం నర్సరీని తనిఖీచేసి బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు నాటే విధానాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించి, వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఆయనవెంట ఎంపీడీవో ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, క్షేత్ర సహాయకురాలు స్వప్న తదితరులు ఉన్నారు.

## సమయ పాలన పాటించాలి

బిచ్కుంద, జనవరి 10: ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో గోపాలకృష్ణ సూచించారు. బిచ్కుంద గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేయించాలని కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది చంద్రకాత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.




రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో గోపాలకృష్ణ

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి

లింగంపేట, జనవరి 10: మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో నరేశ్ శుక్రవారం తెలిపారు. గత సంవత్సరం ప్రజాపాలన గ్రామ సభల్లో ఇందిరమ్మ గృహాల కోసం చేసుకున్న దరఖాస్తులను ఆయా పంచాయతీల కార్యదర్శులు సర్వే చేశారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు నిర్వహించిన సర్వేపై సూపర్ చెక్ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని మాలోత్ సంగ్యానాయక్ తండా, ఎక్కపల్లి, సజ్జన్‌పల్లి, మాలపాటి, శెట్పల్లి సంగారెడ్డి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించినట్లు చెప్పారు. సూపర్ చెక్ సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు



గాలిస్తున్న బట్టుతండా గ్రామస్తులు

రామారెడ్డి, జనవరి 10: చేపల వేటకు వెళ్లి ఒకరు గల్లంతైన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బట్టుతండా గ్రామానికి చెందిన రామావత్ రవీందర్ అలియాస్ రవి (28) స్థానిక దామర చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపును నిలిపివేశారు. శనివారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు.

## బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం

నాగిరెడ్డిపేట, జనవరి10: నాగిరెడ్డిపేట ఏవోగా పని చేసి బదిలీపై వెళ్తున్న ఏవో విజయశేఖర్, ఏఈవో నిఖితను శుక్రవారం స్థానిక రైతు, రాజకీయ నాయకులు ఘనంగా సన్మానించారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. రైతులకు వారు అందజేసిన సేవలను కొనియాడారు. ఏవో విజయశేఖర్ దంపతులతోపాటు ఏఈవో నిఖితకు శాలువా కప్పి సత్కరించారు. ఏవో సాయికిరణ్, విండో అధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా పార్టీల నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధయ్య, కృష్ణ, దుర్గారెడ్డి, సాయిలు, నాగేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా హిందీ దివస్



భిక్కనూరులో బహుమతులు అందుకున్న విద్యార్థులు

మాచారెడ్డి/భిక్కనూరు, జనవరి 10 : మాచారెడ్డి మండలంలోని లచ్చాపేట జడ్పీహెచ్ఎస్‌లో హిందీ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ పండిత్ రాంసింగ్‌ను ప్రధానోపాధ్యాయుడు లక్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడు నరేందర్, ఉపాధ్యాయులు లింగారెడ్డి, అఖిల్‌హుస్సేన్, శ్రీనివాస్, రాజేశ్వరి, రమేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరు మండలం జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో సార్గు నవీన్ అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయుడు గఫూర్ శిక్షక్, ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు లింబాద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## 13 నుంచి డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు

లింగంపేట, జనవరి10: మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో ఈ నెల 13వ తేదీ నుంచి ఎల్లారెడ్డి డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు నరేశ్, భూవర్దన్, అరవింద్ శుక్రవారం తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామస్తుల సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.ఐదు వేలు అందజేస్తామని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే జట్లు 12వ తేదీ సాయంత్రం వరకు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 7780424999, 8688736135, 8185057022 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.